క్లుప్తంగా

నేడు తుంపాల సంతాప సభ

సబ్బవరం: జెడ్పీ వైస్ చైర్మన్, సబ్బవరం జెడ్పీటీసీ సభ్యుడు తుంపాల అప్పారావు అకాల మరణం చెందడంతో ఆయనకు శ్రద్ధాంజలి ఘటించి సంతాప సభ నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్‌నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే కార్యక్రమంలో ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పాల్గొంటారని చెప్పారు. ఎంపీపీ బోకం సూర్యకుమారితో పాటు వైస్ ఎంపీపీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

150 మందికి దంత వైద్య పరీక్షలు



దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సింహాచలం: గొరపల్లిలో సర్పంచ్ గొరపల్లి శ్రీను ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అనిల్ నీరుకొండ ఆస్పత్రి సిబ్బంది 150 మందికి వైద్య పరీక్షలు చేశారు. దంతాల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. డాక్టర్ స్వాతి, హౌసర్జన్లు సుధ, మేఘన, దర్శన, స్వర్ణలత, ఐశ్వర్య, సిబ్బంది సునీత, పీఆర్‌వో ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇంటింటా మట్టి సేకరణ



ప్రజల నుంచి మట్టి సేకరిస్తున్న బీజేపీ నాయకులు

పరవాడ: దేశ ప్రధాని నరేంద్ర మోదీ తలపెట్టిన నా భూమి–నా దేశం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని పెందుర్తి నియోజకవర్గ బీజేపీ నాయకుడు గొర్లి రాము నాయుడు పిలుపునిచ్చారు. దేశ ప్రధాని పిలుపు మేరకు ప్రతి ఇంటి నుంచి చిటికెడు మట్టి సేకరించే కార్యక్రమాన్ని ముత్యాలమ్మపాలెం గ్రామంలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామునాయుడు మాట్లాడుతూ ఢిల్లీలో గ్రామాల నుంచి సేకరించిన మట్టితో అమృతవనం సృష్టించి ఆ వనంలో మొక్కలు నాటడడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కంచిపాటి వెంకట సన్యాసిరావు, జనరల్ సెక్రటరీ ఎర్ర అచ్చింనాయుడు, పెందుర్తి రూరల్ మండల అధ్యక్షుడు కె.జగన్‌మోహన్‌రావు, నాయకులు చిన్న, లక్ష్మణ్, రామకృష్ణ, సోమశేఖర్ పాల్గొన్నారు.


నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు చెక్



మాట్లాడుతున్న ఎంవీఐ బుచ్చిరాజు

అగనంపూడి: వాహనచోదకులు రోడ్డు నియమాలు పాటిస్తే ప్రమాదాలను చాలావరకు కట్టడి చేయవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బుచ్చిరాజు అన్నారు. రోడ్డు భద్రతా నియమాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన వేగం, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడం నేరమని తెలిపారు. ద్విచక్రవాహన చోదకులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు. కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జె.సుధాకర్, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ సుందర్ రామమ్, డీన్ బి.సతీష్, బి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో మెరిశారు



క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో కణితి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఆటల పోటీల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. బుధవారం జరిగిన ఖోఖో, కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. బాలికల ఖోఖో అండర్–17, 14 విభాగంలో విన్నర్స్‌గా, బాలికల షటిల్ బ్యాడ్మింటన్ సీనియర్ విభాగంలో విన్నర్స్‌గా, బాలికల విభాగంలో జూనియర్స్ కబడ్డీలో రన్నర్స్‌గా విజయం సాధించారు. మండల స్థాయిలో అన్ని విభాగాల్లో 10 జట్లు పాల్గొన్నాయని పీడీ మహ్మద్ ఇస్మాయిల్ తెలిపారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- 96వ వార్డులో ఉత్సాహంగా గడప గడపకు..



96వ వార్డులో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. జీవీఎంసీ 96వ వార్డు పరిధి వేగివారి కాలనీ, పెందుర్తి పోలీస్ స్టేషన్ డౌన్ ఏరియాలో బుధవారం ఎమ్మెల్యే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. అర్హుత ఉండి సంక్షేమ పథకం అందకపోతే అందుకు గల కారణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ 96వ వార్డులో ఇప్పటి వరకు రూ.12 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండుకళ్లుగా చేసి జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. నాలుగేళ్లల్లో 95 శాతానికి పైగా హామీలు నెరవేర్చి సంక్షేమ సారథిగా కీర్తి గడించారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న నవరత్నాలతో పాటు అనేక పథకాలు తమకు అందుతున్నాయని ప్రజలంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సంక్షేమ ఫలాలు పార్టీలకతీతంగా అందించడం వల్లే నేడు ప్రతీ ఇంటికి వెళ్లగలుగుతున్నామన్నారు.

ఇంటికే పథకాలు

అవినీతికి తావులేకుండా, పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించి పాలనలో నూతన అధ్యాయానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. నేడు అవ్వా తాతలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ పింఛన్ కోసం తిరగకుండా వాళ్ల వద్దకే పింఛన్ సొమ్ము వచ్చేలా జగన్‌మోహన్‌రెడ్డి చేశారన్నారు.

విద్యా రంగంలో నూతన శకం

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను సీఎం వైఎస్ జగన్ చేరువ చేశారన్నారు. నాడు– నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చారన్నారు. ఎంతమంది జట్టు కట్టి గుంపులుగా పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ప్రజలు ఉంటారని అదీప్‌రాజ్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శరగడం నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు మళ్ల కిషోర్, రఘు, లెక్కల రమేష్, లెక్కల ప్రసాద్, దాడి ఉమామహేష్, అల్లం అప్పారావు, జీవీఎంసీ అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ



పింఛన్‌దారులతో ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం సర్పంచులు



లబ్ధిదారులకు నూతన పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రాము తదితరులు

పరవాడ: ప్రభుత్వం అవ్వాతాతలకు అందించే పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు, తిక్కవానిపాలెం సర్పంచ్ చేపల మసేను అన్నారు. పింఛన్‌దారులకు ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చింతకాయల అమ్మోరు, కోఆప్షన్ సభ్యుడు మైలపల్లి అప్పన్న, ఎంపీటీసీ అరిజిల్లి దేవిరవి, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ సూరాడ ముత్యాలరావు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామంలో నూతనంగా మూజూరైన పింఛన్లను 20 మంది లబ్ధిదారులకు వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు కొటాన రాము,మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు అందజేశారు.అనంతరం లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఐడీ బాబు, సచివాలయ కన్వీనర్ గండి ముత్యాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి పి. సంతోషి, వెల్ఫేర్ అసిస్టెంట్ రేష్మా, వలంటీర్లు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం

- ఏఆర్‌వో రమేష్‌నాయుడు
- దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలని బీఎల్‌వోలకు సూచన



ఓటర్ల జాబితాపై సమీక్షిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు

సబ్బవరం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వేచ్ఛగా.. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే ప్రభుత్వ అధికారుల బాధ్యత అని మండల ఏఆర్‌వో రమేష్ నాయుడు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితా పరిశీలనపై బీఎల్‌వోలతో పోలింగ్ కేంద్రాల వారీగా బుధవారం ఆయన సమీక్షించారు. ఇప్పటికే ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీల పూర్తి చేయడంతో తప్పులు లేని పరిపూర్ణమైన ఓటర్ల జాబితా సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని 68 పోలింగ్ కేంద్రాలకు 68 మంది బీఎల్‌వోలు, ఏడుగురు సూపర్‌వైజర్లు ఈ పనిలో నిమగ్నమయ్యారన్నారు. రాజకీయ పార్టీల నుంచి వచ్చిన అభ్యంతరాలను విచారణ చేపట్టి పరిష్కరించాలన్నారు. జీరో డోర్ నెంబర్లు, ఓటర్ల జాబితాలో 10 మంది కంటే ఎక్కువ గా ఓట్లు ఉన్న కుటుంబాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కొత్త ఓటర్లు(ఫాం–6),తొలగింపులు(ఫాం–7), సవరణలు(ఫాం–8)పై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సిద్ధం చేసిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ను అక్టోబర్17న అన్ని సచివాలయాలతో పాటు తహసీల్దా ర్ కార్యాలయంలో వేలాడదీయనున్నట్లు చెప్పారు.అనంతరం నెల రోజుల వరకూ అభ్యంతరాలు ఉంటే తెలియజేయవచ్చన్నారు. జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో ఏఆర్‌వో –2 బి.సత్యనారాయణ,సూపర్ వైజర్లు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఘనంగా నిత్య కల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ బేడా మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

వినాయక మండపాలకు అనుమతులు

- పరవాడ సీఐ ఈశ్వరరావు



పరవాడ: వినాయక ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ కమిటీలు మండపాల వద్ద ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు కోరారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వినాయక ఉత్సవాల్లో ప్రజలను రెచ్చగొట్టే ప్రసంగాలు మానుకోవాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండగ నిర్వహించుకోవలన్నారు. మండపాల వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అగ్ని ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు పాటించాలన్నారు. ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు బాక్స్ టైపు స్పీకర్లను ఉపయోగించాలని సూచించారు. మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలాగా ఉండాలన్నారు. అవసరమైన మేరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని.. విగ్రహ ప్రతిష్ఠ, నిమజ్జనం సమయాల్లో వాహనం నడిపే డ్రైవర్ మద్యం సేవించడం నేరమన్నారు. ఊరేగింపు సమయంలో అశ్లీల పాటలు, డ్యాన్సులు చేసిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. బాణసంచా కాల్పులను నిషేధించనట్టు చెప్పారు. విగ్రహలను నిర్దేశించిన ప్రాంతంలోనే నిమజ్జనం చేయాలన్నారు. ఆయా నిబంధనలను అనుసరించి వినాయక మండపాల ఏర్పాటుకు ఉత్సవ కమిటీ సొంత పూచీకత్తులపై అనుమతులు తీసుకోవాలని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

గృహసారథుల బీమా నమోదు ప్రారంభం

సబ్బవరం: మండలంలోని నాలుగు సచివాలయాల పరిధిలోని సచివాలయ గృహ సారథుల బీమా నమోదు కార్యక్రమాన్ని బుధవారం విస్తృతంగా చేపట్టారు. ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ ఆదేశాల మేరకు మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో బీమా నమోదు కార్యక్రమాన్ని మొగలిపురంలో ప్రారంభించారు.అనంతరం మొగలిపురం,మల్లునాయుడుపాలెం,గుల్లేపల్లి,సబ్బవరం–2 సచివాలయాల పరిధిలో నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో నియమించిన గృహ సారథులు ఒక్కొక్కరికీ రూ. 2.5 లక్షల బీమా పరిహారం చేయించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, సచివాలయ కన్వీనర్లు ఐడీ బాబు, యడ్ల నాయుడు, గండి మహాలక్ష్మి, బోను గంగునాయుడు,గొర్లి కనకరాజు,సింగంపల్లి దేవి, బండారు శ్రీను,జి. దేముడు బాబు,బైలపూడి దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ముత్యాలమ్మ పాదాలు ప్రతిష్ట



అమ్మవారిని దర్శించుకుంటున్న సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ లక్ష్మణ తదితరులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు చినగొల్లలపాలెంలో గ్రామ దేవత శ్రీముత్యాలమ్మ అమ్మవారి పాదాలను బుధవారం శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. అమ్మవారి హుండీని ఏర్పాటు చేశారు. గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ప్రధాన ఆలయం పెదనాయుడుపాలెం గ్రామంలో ఉన్నట్లు గ్రామ పెద్దలు పల్ల తాతారావు తదితరులు తెలిపారు. దీంతో అమ్మవారికి కానుకలు, విరాళాలు సమర్పించేందుకు గ్రామంలో హుండీ ఏర్పాటు చేయాలని గ్రామ పెద్దలంతా భావించామన్నారు. అయితే అమ్మవారి ఆశీస్సులతో గ్రామస్తులు అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించే విధంగా అమ్మవారి పాదాలు ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. పల్ల తాతారావు, గొంప సంజీవరావు సాయంతో అమ్మవారి పాదాలు,హుండీ ఏర్పాటు చేశారు. గణపతి పూజ అనంతరం సామూహిక కుంకమ పూజలు,సహస్ర నామావళి పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు,ఉప సర్పంచ్ మండల లక్ష్మణ,పెద్దలు,నాయుకులు భర్ణికాన బాబూరావు,గండి రవి కుమార్,గండి ముత్యాలనాయుడు,పల్ల తాతారావు, కోరాడ శ్రీనివాసరావు,తమరాన బంగారునాయుడు, లక్ష్మణ,ఈపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

15,16 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు

సబ్బవరం: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతి రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలను 9 రకాల క్రీడా అంశాల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో ఈ నెల 15,16 తేదీల్లో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రతిభా విద్యాలయం మైదానంలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు 6వ తరగతి నుంచి పదోతరగతి వరకూ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పాల్గొనే విద్యార్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో పాటు పాఠశాల హెచ్ఎంల ధ్రువీకరణతో వెంట తెచ్చుకోవాలని సూచించారు. వాలీబాల్,త్రో బాల్,కబడ్డీ,ఖోఖో,టెన్నీకాయిట్,సెటిల్ బ్యాడ్మింటన్,బాల్ బ్యాడ్మింటన్,యోగ,అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తారు. కోఆర్డినేటర్‌గా సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీడీ రెహమాన్ వ్యవహరించగా చైర్మెన్‌గా పాఠశాల హెచ్ఎం తిరుపతిరావు వ్యవహరిస్తారన్నారు. సందేహాలు ఉన్నవారు 95022 77908 నెంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

సింహాచలం: మండల సాధారణ సర్వ సభ్య సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వసంత తెలిపారు. మండల పరిషత్ మందిరంలో ఉదయం 10.30గంటలకు సమావేశం ప్రారంభమవతుందని పేర్కొన్నారు. ఎంపీటీసీ లు, అధికారులు అంతా కార్యక్రమంలో పాల్గొనాలని ఆమె కోరారు.

'కార్పొరేట్'కు లాభం చేకూర్చేందుకే ప్రైవేటీకరణ



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న నాయకుడు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుట్రపూరిత ఆలోచనతోనే ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభం చేకూర్చేందుకు ఇటువంటి కుట్రలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 944వ రోజు బుధవారం సంస్థకు చెందిన ఎస్ఎంఎస్–1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో కేవలం రూ.10 కోట్ల ఖర్చుతో 1700 టన్నుల ఆక్సిజన్ తయారుచేస్తోందన్నారు. కానీ కేంద్రప్రభుత్వం దుర్మార్గపు ఆలోచనతో ప్రైవేట్‌వారికి రూ. 50 కోట్లు ఖర్చు చేయడానికి అంగీకరించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికే విశాఖ స్టీల్ ప్లాంట్ 2700 టన్నుల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తోందని, మరో 1700 టన్నుల ఆక్సిజన్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్‌ను నిర్మించడం జరిగిందని తెలిపారు. కానీ నేడు కేంద్రప్రభుత్వం ప్లాంట్‌ను నడపలేమని చెప్పడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తామనే ప్రకటన చేయాలని, లేనిపక్షంలో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, ఆయోధ్యరామ్, పరంధామయ్య, ఎస్ఎంఎస్–1 ప్రతినిధులు విడివి పూర్ణచంద్రరావు, రమణ మూర్తి, ముత్యాల నాయుడు, గుమ్మడి నరేంద్ర, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ రిలే దీక్షలు

పరవాడ: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా బుధవారం వాడచీపురుపల్లిలో చేపట్టిన రిలే దీక్షలను మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మాసవరపు అప్పలనాయుడు, మాజీ జెడ్పీటీసీ పైల జగన్నాథరావు, మండల టీడీపీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, పలువురు నాయకులు పాల్గొన్నారు.

జీవరాశులమనుగడకు వృక్షాలు ఆధారం




ప్రసంగిస్తున్న ఆచార్య జి.సాల్మన్‌రాజు

ఏయూ క్యాంపస్: జీవరాశుల మనుగడకు వృక్షాలు ఆధారంగా నిలుస్తాయని ఏయూ పర్యావరణ శాస్త్ర విభాగ ఆచార్యుడు జి.సాల్మన్‌రాజు తెలిపారు. ఏయూ హెచ్‌ఆర్‌డీసీ కేంద్రంలో నిర్వహిస్తున్న పర్యావరణ శాస్త్ర పునశ్చరణ తరగతుల్లో అధ్యాపకులనుద్దేశించి ఆయన ప్రత్యేక ప్రసంగం చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న అడువులు, వృక్ష వైవిధ్యత, పుష్పాలు, వృక్షాలతో ఇతర జీవులకు ఉన్న అనుబంధం కళ్లకు కట్టినట్లు వివరించారు. కీటకాలు, పక్షులకు వృక్షాలు ఆధారంగా నిలుస్తున్న విధానాన్ని ఫొటోలతో సహ అవగాహన కల్పించారు. కలుపు మొక్కల నుంచి వచ్చే పువ్వులు సైతం సీతాకోక చిలుకలు, తేనెటీగలు, పక్షులకు ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. ప్రధానంగా వేసవిలో అనేక పక్షులు, జీవులకు ప్రాణాధారంగా వృక్షాలు నిలుస్తున్న విధానాన్ని తెలియజేశారు. శేషాచలం అడవుల్లో దర్శనమిచ్చే వివిధ ఔషధ, సుగంధ వృక్షాల ప్రత్యేకతలను వివరించారు. తూర్పు, పశ్చిమ కనుమల్లో ఉండే వృక్ష వైవిధ్యతలు, గిరిజన ప్రాంతాలలో ఉండే చెట్లు, పుష్పాల విశిష్టతను తెలియజేశారు. పలు పుష్పాలు పురుగులను ఆకర్షించి తిగిరి వెళ్లనివ్వకుండా మరణించేలా చేస్తాయని, వీటిని కిల్లర్ ఫ్లవర్‌గా పిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం సంచాలకులు ఆచార్య టి.వెంకటకృష్ణ, ఆచార్య ఎన్.ఎ.డి.పాల్, తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదు

- విద్యార్థులు స్నేహభావం కలిగి ఉండాలి
- జిల్లా అదనపు న్యాయమూర్తి వాణిశ్రీ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా అదనపు, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి వాణిశ్రీ

దాబాగార్డెన్స్ : విద్యార్థులు స్నేహ భావం కలిగి ఉండాలని, సీనియర్లు జూనియర్లను ర్యాగింగ్ చేస్తే శిక్ష తప్పదని జిల్లా అదనపు న్యాయమూర్తి, ఫ్యామిలీ కోర్టు జడ్జి వాణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టం 1997పై బుధవారం ఏవీఎన్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వాణిశ్రీ మాట్లాడుతూ విద్యార్థులు చదువుకే పరిమితం కాకుండా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం, న్యాయ వ్యవస్థపై గౌరవభావం కలిగి ఉండడం అవసరమన్నారు. జూనియర్లను సీనియర్లు ర్యాగింగ్ చేసే విధానం ఎన్నో ఏళ్ల నుంచి కళాశాల స్థాయిలో జరుగుతున్న నేపథ్యంలో ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా చట్టం ఏర్పడిందని, ఈ చట్టానికి లోబడి ప్రతి పౌరుడు ఉండాల్సిందేనన్నారు. సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి ఎంవీ శేషమ్మ మాట్లాడుతూ ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు పౌర సమాజంలో ఎన్నో మంచి మార్పులు వచ్చేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు యేసయ్య, ఆనంద్, వెంకటరత్నం, గాయత్రి, వినీత ర్యాగింగ్ చట్టాలు, శిక్షలపై మాట్లాడారు. ఏవీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎల్‌వీకే ప్రసాద్, ఆంధ్రా మెడికల్ కళాశాల ఫిజియాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ పీఎస్ఎన్ రాజు, ప్రభుత్వ మానసిక ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె. మాధవీలత, లీగల్ సెల్ అథారిటీ ప్యానెల్ న్యాయవాది కె. అప్పలనాయుడు, ఏవీఎన్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, ఇంగ్లిష్ విభాగాధిపతి పైడి రజని అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వారి వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

ఆచార్యుడు రాధాకృష్ణ మృతికి సంతాపం



డాక్టర్ రాధాకృష్ణ చిత్ర పటానికి నమస్కరిస్తున్న ప్రిన్సిపాల్ తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యుడు డాక్టర్ ఎల్.రాధాకృష్ణ(50) అకాల మృతికి విభాగ ఆచార్యులు, విద్యార్థులు సంతాపం తెలిపారు. బుధవారం విభాగంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో రాధాకృష్ణ చిత్రపటానికి ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్, విభాగాధిపతి ఆచార్య జాలాది రవి పూల మాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ రాధాకృష్ణతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏవీఎన్ కళా శాల నుంచి 2020లో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి డిప్యుటేషన్‌పై వచ్చిన రాధాకృష్ణ ఎంతో నిబద్ధత లో సేవలు అందించారని కొనియాడారు. స్వశక్తితో ఎదిగి, ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మంచి వ్యక్తిని కోల్పోవడం తీరని లోటన్నారు.

ఎంప్లాయిస్ యూనియన్ గుర్తింపుపై హర్షం



స్టీల్ సిటీ డిపోలో స్వీట్లు పంపిణీ చేస్తున్న ఈయూ నాయకులు

ఉక్కునగరం: ఎంప్లాయిస్ యూనియన్‌ను ఆర్టీసీ యాజమాన్యం గుర్తింపు యూనియన్‌గా ప్రకటించడంపై స్టీల్ సిటీ డిపోలో యూనియన్ ప్రతినిధులు బుధవారం స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత మెజార్టీ సంఘంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తిని మన్నించి గుర్తించినందుకు డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధన్యావాదాలు తెలిపారు. డిపో కార్యదర్శి బి. రాము మాట్లాడుతూ ఉద్యోగుల హక్కులు, సమస్యల పరిష్కారంతో పాటు సంస్థకు మరింత మేలు జరిగేలా పని చేస్తామన్నారు. గుర్తింపు రావడానికి సహకరించిన ఏపీ జాక్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎం.గోపాలుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హెచ్.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.